# ?

కలా - నిజమా ? కవులకల్పనలోనివా - వాస్తవంగా ఈలాటి ఘోరాలు జరుగుతాయా ? విధికి అంత ఓర్వలేని తనం ఎందుకో ?

*　　*　　*

మామూలుకన్నా కొంచెం ఆలస్యంగా నిద్రలేచాడు. బద్ధకంతీరేదాకా పక్కదిగకుండానే రాత్రి మొదలు వేసిన నవలను ఆఖరుచేశాడు. అద్దందగ్గర నిలుచుని క్రాఫ్‌సరిచేసుకుని, తనఅందాన్ని చూసి మురుస్తూ...ముసిముసినవ్వుతో చిత్రమూర్తిగా ఉన్నా, నవకాలు చిందిస్తూఉన్న హైమ ఫొటోగ్రాఫును చాలాసేపు సాకూతంగా వీక్షించాడు... "ఎన్నాళ్ళయింది వెళ్ళి - ఎప్పుడు వస్తుందో ? ఈ ఆడుపడుచుల మోరాయింపులకు అంతుఉంటేనా ? పుట్టింట్లో విందులుకుడుస్తూ కూర్చుంటే "ఇయం గేహే లక్ష్మీ" అని నమ్ముకుని ఆసపడుతూండేవాళ్ళపని మరి ఇంతేనా? చెపుతూంటాను,కథ వ్రాసిపెట్టమంటే ఏవోసాకులుచెప్పి తప్పించుకునే అలసత్వం అంతా ఎక్కడికిపోయింది ? ఎగ్జిబిషన్‌కోసం వాళ్ళఅమ్మ ఏవో కుడుతూంటే, తనుకూడా అది పోయేదాకా అక్కడే ఉండాలేం?...నడుమువాల్చకుండా రోజూ

పొద్దస్తమానమూ కూచుంటున్నామంటే నా కేమన్నా ఒలి కిందా ఇక్కడ?...నా జేబురుమాళ్ళకు పోగులుతీసి అంచులు కుట్టిపెడతానని ఇక్కడికి ఎన్నివాయిదాలయినాయి? ప్రైజు వస్తుందిట. నే నున్నాను చాలదూ?...వాళ్ళనాన్న చవు కగా ఐదువందలకి దొరికానని కొని ఇచ్చాడుగా! అబ్బ! ఈ పెళ్ళాలన్నవాళ్ళు ఎప్పుడూ ఇంతే..."

మెట్లుదిగి వస్తున్నాడు. అంతలో ఆగిపోయి కల కంటున్నానా అని భ్రాంతితో హర్షవిస్ఫారితనయనాలతో చూసినాడు. నిజమే, హైమ - కటకటాలను ఆనుకుని నిలు చునిఉన్నది.

మెట్లు లెక్కపెట్టుకుంటూ దిక్కులుచూస్తూ తాపీగా దిగే అలవాటు ఆ నిమిషాన మాయమైపోయింది. ఒక్క చెంగున ఆమెవద్దకు దూకేశాడు వరదరాజు. హైమ, ఆతని ఆవేగాన్ని గమనించి కొంచెం వైదొలగింది.

"నిజమేనా ?"

"ఏమిటి?" అని హైమ అమాయికంగా చూస్తూ, ఏమీ తెలియనిదానిలాగా అడిగింది.

"నిజంగా...నీవు—నీవేనా కనబడుతూంది?"

హైమ నవ్వింది.

"నిద్రలేవగానే ఎవరిమొగము-నాముఖమే. కాదూ చూసుకుంది? మంచిదేనన్నమాట—"

"ఇప్పుడేనా నిద్రలేవడం?"

"కాదు, చాలాసేపయింది...కాని—"

"ఇంతసేపటిదాకా ఏంచేస్తూన్నారూ మరి క్రిందికి రాకుండా?"

"కలగంటున్నాను. తనుదర్శనభాగ్యం ఇంత త్వరగా ఈలా తలవనితలంపుగా—"

"చాల్లెండి...మరీ నేర్చుకుంటున్నారు..."

"నేర్పడానికి నీవు దగ్గరలేందేనా?"

అన్ని ఉత్తరాలు వ్రాయకపోతే మీారు రాలేక పోయినారూ? సెలవరోజునవస్తే మనంఇద్దరం కలిసి వచ్చేసే వాళ్ళం కాదూ?"

"నేను వస్తే...మరి రాణీగారికి తీరా దయవస్తుందో-రాదో, అసలు దర్శనమేకరవౌతుందేమోనని భయపడ్డాను"

"ఈ శలాయింపులకేంలెండి. బయలుదేరడానికి బద్ధకమనరాదూ?"

"పోనీ దయతలచి నీవే రావా అని—"

"అవును, ఈ మొగవాళ్ళమతమే ఇది. ఎవరికోసం వస్తుంది అని దిలాసా. పంపించి, తిరిగి మొగమైనా చూడరమ్మా...ఈ జాతిలక్షణమే ఇది."

వరద, మాఁరుమాట చెప్పకుండా లోపలికి వెళ్ళి పోయినాడు. స్నానాధికములు పూర్తిచేసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాడు. హైమ వేషంమార్చేసుకుని సరిగపని చేసిన రాజ్‌పుటానా సిల్కుచీరె కట్టుకుని వచ్చి ఆతనిసరసను నిలుచున్నది.

"మోహినిలాగా ఉన్నావు..."

హైమ చిరునగవుతో ఆతనిముంగురులు సరిచేస్తూ

"నాకు తెలుసు లెండి మీ యెత్తు. అమృతదానం– కాఫీ... కోసం ఇన్ని వగలా?"

కాఫీ కప్పుల్లో పోసింది. ఆతడు చూసి ఊరుకున్నాడు.

"తాగండి"

వరద, పసిపిల్లవాడిలాగా మారాంచేస్తూ బుంగ మూతితో "భోజ్యేషు మాతా..." అని హైమవంక చూసి నవ్వాడు. ప్రేమ వెల్లివిరుస్తూఉన్న చూపులతో ఆమె కాఫీ ఆతనినోటికి అందించింది. అవకాశాన్ని పురస్కరించుకుని ఆతడు హైమను దగ్గరకులాక్కున్నాడు.

"ఊఁ ఊఁ – ఉండండి – చూడండి మరి, చీరంతా కాఫీ తొణికింది...ఇంతే మీరు ఎప్పుడూను..."

"పోనీలే, నాకేగా ఫైను... చెల్లారాంపాపును మళ్ళా ఒకమారు తాము పవిత్రంచేయాలిసిన అవసరం కలిగిందన్నమాట. ధన్యుణ్ణి...

"ఈమారే, లేత ఊదాలో కొనండి. ఎంబ్రాయిడరీలో చక్కని సన్న అంచులవి వస్తున్నాయి..."

"జో హుకుం"

హైమ అతనిబుగ్గలు సాగదీస్తూ "అంత నవ్వుగా ఉందేం? చెపుతానుండండి మీ పని. నా సంగతి అసలు మీరు—"

"మళ్ళా దేవిగారు పుట్టింటికి ప్రయాణం—"

"ఆఁ! అదేపని!... మీరు కావలిస్తే వెళ్ళండి... అత్తవారియింటికి..."

కాఫీతాగడం అయింది. వరద కుర్చీలోనుంచిలేచాడు.

సిగరెట్టుముట్టించవలెనని అపేక్షపడి, మళ్ళా మాని వేసి, నిలుచుని, హైమభుజములమీద చేతులు వేసి, ఆమెచక్కదనాన్ని చూస్తూ "నీకు కోపంవస్తే తాళుకోలేను బాబూ ! నాకు భయంవేసుకొస్తున్నది. నీవు మీవాళ్ళయింటికి ప్రయాణం కట్టావా అంటే—"

హైమ అతన్ని కౌగలించుకుని సిగ్గుతో _ విలాసంగా "గాద్గదికంతో— మిమ్మల్ని...విడిచి ఉండలేను... నేను అడిగినా, మావాళ్ళయింటికి పంపకండి" అని దీనంగా చూసింది.

ఆతడు "ఆఁ! అంతా నిజమే!" అని ఎకసక్కెముచేసి నట్లు నటించాడు.

హైమ చెంపమీద చిన్న జెల్లా యిచ్చి లోపలికి పారిపోయింది. వరద సూట్ వేసుకుని కారులో కాలేజీకి వెళ్ళిపోయినాడు.

*　　*　　*　　*

వికసించినవి జాజి
విరులు నీ వేణిలో
ప్రకటించినది వలపు
సుకుమార తనువల్లి...ఇక నేలనే చెలీ!

ననలెత్తినవి భావ
నా నవ్య మాధురిని
నవనవోదయ జీవ
నాలస విలాసాలు...

అళికుమారీ గీతి
కా లాలితమ్ములై
అలయించినవి మల్లి
కా మందహాసాలు...

వెన్నెలలేని లోపం తీర్చడానికి 'వెలుగుదీపాలు' తంటాలుపడుతున్నాయి. హైమ, డ్రెసింగ్ టేబిల్ దగ్గర నిలుచుని తలలో పూలదండ సరిజేసుకుంటున్నది. 'మొగవాళ్ళు ఎంతకైనా తగుదురు. ఎంత నిబ్బరం! నాకోసం ఎంత ఉబలాటపడుతున్నా — తపిస్తున్నా — ఎదుటపడేటప్పటికి ఎందుకో అంత అభిమానం, ఆ దర్జా? అనిపించలేకపోయినా నుగా ఆయనచేత...నానోటివెంటే చెప్పించారు. కానీ, ఇంటికి రానీ. భోజనంఅయినతరువాత ని-ద్ర-పో-తా-ను. ఊహుఁ...!సినిమాకు వెళ్దామని పట్టుబడతాను. నా కసి తీరా—ఏం—నన్ను విడిచిఉండలేనని అనకూడదేం?"

చీకటిపడింది బాగా. కారుచప్పుడౌతుందేమోనని హైమ చెవిఒగ్గి ఏంధ్వనిఅయినా వింటూంది. 'అబ్బ ఇవాళ కూడా ఆలస్యమేనా? రెండు నెలలకి-ఈ రాత్రి;-ఇంకెంతసేపటికి వస్తారో? ఇవిగో ఈ కొత్తపుస్తకాల దొంతర్లన్నీ మళ్లా వచ్చిపడ్డాయి. మా అమ్మో! చదవనిస్తాననుకుంటున్నారు కాబోలు! అన్నీ దాచేయాలి. ఎప్పుడూ చదువేనా?...ఈ సిల్కుషర్టులు ఎప్పుడు కుట్టించుకున్నారో? బాగున్నాయి... ఇవాళ ఇదే తొడుక్కోమంటా. మా నాన్న పెట్టిన పంచల మీదికి ఇవి చాలా చక్కగా ఉంటాయి. ఆ!...ఇదుగో, అసలుసంగతే మరచిపోయినానేం? చాలా ఈ సిగరెట్లన్నీని?

కాల్చి పొగ నా మీదికి ఊదుతారు బాబోయ్...! అవి ఉన్నంతసేపూ నేనైనా కనబడతానా? సొరుగులో పెట్టి తాళంవేశేస్తా. ఎప్పుడన్నా ముచ్చటగా నే నిచ్చినప్పుడు కాని, ఎప్పుడూ అగ్నిహోత్రాలేనా?"

ఇంకా కొంచెం పొద్దుపోయింది. మామూలువేళ కూడా దాటిపోతూంది...

"రావలసిందే ఈపాటికి...ఎక్కడ-ఇంతసేపు ఏం చేస్తున్నారో? అదా సంగతి...పెందరాడే వచ్చేస్తే నాకోసం పరిగెత్తుకునివచ్చారని ఉడికిలిస్తానని – ఎక్కడో తిరుగుతూ ఉండాలి...ఏం? అంత సదురేం? అబ్బ! ఈలాగైతే నే నుండలేను. రేపణ్ణుంచీ కారువెళ్ళేటప్పుడు నేనుకూడా బయలుదేరుతా. అక్కడనుంచి ఆలాగే షికారుకొట్టి ఇంటికి చేరుకోవచ్చును. అంతే, ఇకనుంచి ఆపనే చేయాలి."

ఫోను మ్రోగింది.

హైమ, వినికూడా విసువుతో ఊరుకుంది; కాని అవతలవాళ్లు వదిలిపెట్టలేదు...రింగ్ చేస్తూనేఉన్నారు..."ఎవరో బాబూ! వేళకు సరిగా సిద్ధమైనారు. ఎవరన్నా పిలిచారంటే ఈయన ఇల్లూవాకిలీ వదిలి, పరుగెత్తుతారు. ఈవేళే—ఈ రాత్రే ఏమంతపని ముంచుకుపోతోందో? నేను పలకను. ఎంతసేపని పిలుస్తారో చూస్తాను.

ఆగిపోయింది.

"...అమ్మయ్య!...గండం గడిచింది......ఎనిమిది దాటుతూంది. ఇంకా రాలేదేమో? ఈపాటికి వస్తూండాలి. రానీ, పనిపట్టిస్తా. మరీ బొత్తిగా భయంలేక చెడిపోతున్నారు.

చక్కగా అలంకరించుకుని ఎప్పుడు వస్తారో అని ఎదురు చూస్తూంటే, తమచిత్తంవచ్చినప్పుడు దయచేస్తారేం ?"

మళ్ళా...ఫోను.

అవతలవాళ్ళను మనసులోనే మ్రింగేసేకోపంతో హైమ రిశీవరును అందుకుని పరధ్యానంగా—

"హలో !" అన్నది.

"జనరల్ - హాస్పిటల్"

"ఆ హాఁ"

"డాక్టర్ రామునీమీనన్ మాట్లాడుతున్నది; ప్రొఫెసర్ వరదరాజాకు - ప్రాణాపాయ—

"ఏమిటి, - ఏమిటి మీా రంటున్నది...ఆఁ"

"కారు ట్రాముతో కొట్టుకున్నది..."

"ఆఁ! ఆఁ! ఎలా ఉన్నారు? చెప్పండి. ఎలా— ఉన్నా—రు—?"

"స్పృహలేదు. వారి స్నేహితు—భార్యను రమ్మనండి..."

—o—